


## నేతకానీలను విమర్శిస్తే ఊరుకునేది లేదు

మందమర్రి, ఫిబ్రవరి 10 : నేతకాని కులస్తులను విమర్శిస్తే ఊరుకునేది లేదని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్ల రాజమల్లు, జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు స్పష్టం చేశారు. మందమర్రి పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాల సంఘం నాయకులు నేతకాని కులస్తులను తక్కువ చేసి విమర్శించడం సరైన విధానం కాదన్నారు. చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యే నియోజకవర్గాలతో పాటు, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలోని నేతకాని కులస్తుల ఓట్లతో కాంగ్రెస్ నాయకులు పదవులు పొందారని పేర్కొన్నారు. తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడితో పాటు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణను విమర్శించే స్థాయి వారికి లేదన్నారు. మహిళా ఉపాధ్యక్షురాలు గోలేటి లక్ష్మి, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అనపర్తి యువరాజ్, ప్రధాన కార్యదర్శి దుర్గం సంతోష్, మండల నాయకుడు దుర్గం రాజయ్య పాల్గొన్నారు.

## ఓటరు ముసాయిదా ప్రదర్శన

హాజీపూర్/కాసిపేట/కౌటాల/తిర్యాణి, ఫిబ్రవరి 10 : హాజీపూర్, కాసిపేట, కౌటాల, తిర్యాణి మండలాల్లోని ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి ఎన్నికల సందర్భంగా ఆయా ఎంపీడీవో కార్యాలయాల్లో సోమవారం ఓటరు జాబితా ముసాయిదాను అధికారులు ప్రదర్శించారు. ఆయా కార్యక్రమాల్లో హాజీపూర్ సీనియర్ అసిస్టెంట్ కొండయ్య కాసిపేట, కౌటాల, తిర్యాణి మండలాల ఎంపీడీవోలు సత్యనారాయణ సింగ్, కోట ప్రసాద్, వేముల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏరియర్స్, పెన్షన్ రాక ఇబ్బందులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 10 : సింగరేణిలో 11వ వేజ్ బోర్డులో విరమణ పొందిన కార్మికులకు ఏరియర్స్, పెన్షన్ చెల్లించాలని, వారు ఇబ్బందులు పడుతున్నారని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్‌తో కలిసి సోమవారం ఆయన మాట్లాడారు. నవంబర్, డిసెంబర్‌లో బయోమెట్రిక్ విధానం ద్వారా జీవన్ ప్రమాణ్, మెడికల్ కార్డులు రెన్యూవల్ చేసుకోవడంలో చిన్న చిన్న తప్పుల వల్ల పెన్షన్ పొందలేకపోతున్నారని, అలాగే మెడకల్ సౌకర్యం కూడా పొందలేకపోతున్నారని తెలిపారు. రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర సంయుక్త కార్యదిర్శ పానగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజర్ అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బెల్లంపల్లి, ఫిబ్రవరి 10 : రిటైర్డ్ కార్మికులకు రూ.20 లక్షల గ్రాడ్యూటీ చెల్లించాలని టీఎనీటయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. కార్యాలయంలో మాట్లాడారు. డబ్ల్యూసీలో గ్రాడ్యూటీపై కోర్టులో కేసు నమోదైందని పేర్కొన్నారు. నాయకులు ఆవాల మధుసూదన్ రెడ్డి, మేకల రాజయ్య, బుల్లు సత్తయ్య, దాగం పోశం, ఆవులూరి ఓదెలు, తాహెర్ ఖాన్, ఎదులూరి ఓదెలు పాల్గొన్నారు.

## విద్యార్థినికి సన్మానం

కోటపల్లి, ఫిబ్రవరి 10 : గణతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన పరేడ్‌లో పాల్గొన్న కోటపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని గుగ్లోత్ రుచిత, ఆమె తల్లిదండ్రులు లలితా–దేశ్యానాయక్‌ను సోమవారం ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు సన్మానించారు. మోడల్ స్కూల్‌లో చదివిన రుచిత పరేడ్‌లో పాల్గొనడం గర్వకారణమని పేర్కొన్నారు.

## నిత్యావసర సరుకులు అందజేత

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 10 : అమృతహస్తం వెల్ఫేర్ సొసైటీ వృద్ధుల వికలాంగుల ఆశ్రమంలో మంచిర్యాల మహిళా తరంగిణి మమత ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు. అధ్యక్షురాలు మంజులకృష్ణారావు ఫోర్ బర్నర్ స్టవ్‌ను అందించారు. అనంతరం పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు లత, వందనపు నాగమణి, జ్యోతి పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన

భీమారం, ఫిబ్రవరి 10 : కొత్తపల్లి శివారు ప్రాంతంలోని వరి క్షేత్రాలను మండల వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ సందర్శించి, రైతులకకు అవగాహన కల్పించారు. వరి కాండం తొలుచు పురుగుతోపాటు, పొలాల్లో చౌడు కూడా గమనించి, పరిష్కార చర్యలు వివరించారు. ఏఈవో అరుణ్ కుమార్, రైతులు కలగూర లింగయ్య, కలగూర వెంకటి, కలగూర రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# టాయిలెట్లు పూర్తయ్యేనా..!

- ఏడాది గడిచినా పూర్తికాని పనులు
- మందమర్రి బస్టాండ్‌లో ప్రజలు, ప్రయాణికుల ఇబ్బందులు

మందమర్రి, ఫిబ్రవరి 10 : మందమర్రి పట్టణంలోని మార్కెట్‌లో గల ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో టాయిలెట్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రజల సౌకర్యార్థం గతేడాది గతేదాది జనవరి 21న చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ శంఖుస్థాపన చేసి పనులు ప్రారంభించగా, ఏడాది గడిచినా ప్రారంభానికి నోచుకోకుండా పోయింది. శంకుస్థాపన సమయంలో మూడునెలల్లో పూర్తిచేస్తామని చెప్పిన ఎమ్మెల్యే.. అనంతరం అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో పట్టణ ప్రజలు, ప్రయాణికుల్లో తీవ్ర అసంతృప్తి


మందమర్రి మార్కెట్ ఆర్టీసీ బస్టాండ్‌లో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్లు

నెలకొన్నది. నిత్యం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు, వివిధ అవసరాలపై మార్కెట్‌కు వచ్చే వారు, చిరు వ్యాపారులు పబ్లిక్ టాయిలెట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణం పూర్తయితే సమస్య పరిష్కారమవుతుందని ఆశించిన తమకు నిరాశే మిగిలిందని ప్రజలు, ప్రయాణికులు అంటున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొట్టమొదటి కార్యక్రమంలో భాగంగా ఈ పనులకు శంకుస్థాపన చేయగా, మొదటి పనే పర్తికాకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### టాయిలెట్ నిర్మాణం పనులను పూర్తి చేయాలి..

మందమర్రి మార్కెట్ బస్ స్టేషన్ ఆవరణలో ఎమ్మెల్యే వివేక్ గతేడాది శంఖుస్థాపన చేసిన పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. అసంపూర్తి నిర్మాణంలో ఉన్న టాయిలెట్లను సోమవారం ఆయన పరిశీలించారు.

# సింగరేణిలో డైరెక్టర్ల నియామకం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 10 : సింగరేణిలో ఖాళీగా ఉన్న నాలుగు డైరెక్టర్ పోస్టుల్లో సోమవారం రెండు పోస్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నియమించాయి. సింగరేణిలో సీఎండీ(ఐఏఎస్)ను, డైరెక్టర్ (ఫైనాన్స్)ను ఏఎఫ్ఎస్‌లను.., మిగిలిగిన డైరెక్టర్లను సింగరేణిలోని అనుభవం గల సర్వీస్ జీఎంల నుంచి నియమిస్తారు. కొంత కాలంగా ఖాళీగా ఉన్న డైరెక్టర్ (పీపీ, ఆపరేషన్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం సింగరేణి వ్యాప్తంగా ఉన్న 10 మంది జీఎంలను ఇంటర్వ్యూలకు పిలిచారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర కోలిండియా చీఫ్ సెక్రటరీలు, సీఎండీ, కోల్‌సెక్టార్ ఉన్నతాధికారులతో కూడిన కమిటీ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ మేరకు శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణను డైరెక్టర్ (పీపీ)గా, రామగుండం ఆర్జీ–3 ఆడ్రియాల జీఎం కొప్పుల వెంకటేశ్వర్లును డైరెక్టర్ (ఆపరేషన్)గా నియమించారు. సింగరేణిలో డైరెక్టర్ల సంఖ్య నలుగురికి చేరింది. డైరెక్టర్ (పా), డైరెక్టర్ (ఫైనాన్స్) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీఎండీ బలరాం డైరెక్టర్ (ఫైనాన్స్, పా) గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.


డైరెక్టర్ (పీపీ) సూర్యనారాయణ


డైరెక్టర్(ఆపరేషన్) వెంకటేశ్వర్లు

# బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ

నస్పూర్, ఫిబ్రవరి 10 : కొత్తగూడెంలో 6 నుంచి 9వ తేదీ వరకు జరిగిన పదో రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపినటుల జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుల్లూరి సుధాకర్ సోమవారం తెలిపారు. 75 ప్లస్ విభాగం సింగిల్స్‌లో మందమర్రికి చెందిన పల్లెం రాజలింగు విన్నర్‌గా, డబుల్స్‌లో వరంగల్ క్రీడాకారుడు, రిటైర్డ్ డీఎస్పీ నరసయ్యతో కలిసి పాల్గొని విన్నర్‌గా నిలిచాడు. అలాగే 35 ప్లస్ విభాగం మిక్స్‌డ్ డబుల్స్‌లో మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన క్రీడాకారుడు, సికింద్రాబాద్‌లోని డిఫెన్స్ ఫెన్షన్ విభాగంలో పనిచేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి హర్షవర్ధన్.. హైదరాబాద్ క్రీడాకారిణి ప్రశాంతితో కలిసి రన్నర్‌గా నిలిచినట్లు వివరించారు. వీరికి భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ట్రోఫీతో పాటు, సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ముకేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు భాస్కర్ల వాసు, బండ మీనారెడ్డి, ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి అభినందించారు. రాజలింగు, హర్షవర్ధన్ మార్చిలో గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.


ఐటీడీఏ పీవో రాహుల్ చేతుల మీదుగా ట్రోఫీ, సర్టిఫికెట్ అందుకుంటున్న క్రీడాకారులు

# ఉత్తమ ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న ఆర్‌జేడీ త్యనారాయణ రెడ్డి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 10 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి అన్నారు. స్థానిక రాజేంద్ర ప్రసాద్ బీఎడ్ కళాశాలలో సోమవారం డీఈవో గమన్యాయెల్ అధ్యక్షతన ఎంఈవోలు, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి అత్యధికంగా 10 జీపీఏ సాధించేలా కృషిచేయాలన్నారు. జిల్లాలోని నలుగురు కో ఆర్డినేటర్లు పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల అధికారి ఉదయ్ బాబు, ఫైనాన్స్ అకౌంటెంట్ అధికారి దేవాజి, కో ఆర్డినేటర్ మధూకర్, అబిద్ అలీ, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి తదితరులున్నారు.


రామ చిలుకల వలె కనిపిస్తున్న పుష్పాలు

## రామచిలుకలు కాదు.. పుష్పాలే...

*ఈ చిత్రంలో కనిపిస్తున్నవి రామచిలుకలు అనుకుంటే పొరపడినట్లే... అచ్చం రంగు రంగులతో కూడిన చిలుకల మాదిరిగా కనిపిస్తున్నది రణపాల చెట్టు. ఈ చెట్టు పూలు రంగు రంగులతో కూడిన చిలుకల వలే దర్శనమిస్తున్నాయి. ఇవి మంచిర్యాలలోని రాళ్ల పేటలో కనిపించగా 'నమస్తే' క్లిక్ మనిపించింది. - మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఫిబ్రవరి 10*

## శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 10 : శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ చేపడుతున్నట్లు ఆసిఫాబాద్ పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం పట్టణంలోని ఆర్ఆర్ కాలనీలో సీఐ తన బృందంతో కలిసి కాలనీలోని ఇళ్లలో తనిఖీలు చేశారు. ధ్రువపత్రాలు లేని 82 బైకులు, 4 ఆటోలు, కారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నలుగురు ఎస్ఐలు, 60 మంది పోలీసులు పాల్గొన్నారు.

## మాలీలను ఎస్టీ జాబితాలో కలుపాలి

వాంకిడి, ఫిబ్రవరి 10 : రాష్ట్రంలోని మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో కలపాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే కోరారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతి రావు పూలే ప్రజాభవన్‌లో సోమవారం డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను జాతీయ, రాష్ట్ర, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేతలతో కలిసి 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సతార మహారాష్ట్రకు చెందిన దిలీప్ గణపతి నేవసే సర్, జాతీయ అధ్యక్షుడు విలాసరావు పాటిల్, గుజరాత్ సంఘ అధ్యక్షుడు డాక్టర్ శ్యామరావు పూలే, మధ్యప్రదేశ్ అధ్యక్షుడు, అడ్వకేట్ అఖిల వాగేలా, మాలీ మహా సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వినోద నాగోశే, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్నులే నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న సెండే, రాష్ట్ర కోశాధికారి సతీశ్ గుర్నులే, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు గుర్నులే మేంగజి, కొట్రాంగె సాగర్, బెండరే కృష్ణ, సెండే తిరుపతి, సెండే చంద్రశేఖర్, వినోద్ గుర్నులే తదితరులు ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగ నిరసన

కౌటాల, ఫిబ్రవరి 10 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం మాల మహార్ నేతకాని ఇన్కర్ సంఘం నాయకులు నిరసన తెలిపారు. మాజీ ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి విరుద్ధంగా 4వ తేదీన అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కమిటీ సభ్యులు బండురావు, జానకీ రావు, కిషోర్, హెమాజీ, ప్రకాశ్, అశోక్, జీవన్ తదితరులున్నారు.